ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet Edition
శనివారం 17 ఆగస్ట్ 2024 www.prajaaswaramdaily.com 4PM

# బస్సు కిందికి దూసుకెళ్లిన ఆటో

## పదో తరగతి విద్యార్థిని మృతి.. హైదరాబాద్ హబ్సిగూడలో ఘటన

ప్రజా స్వరం, తెలంగాణ బ్యూరో : స్కూల్ పిల్లల ఆటో ఆర్టీసీ బస్సు కిందికి దూసుకెళ్లడంతో పదో తరగతి విద్యార్థిని మృతిచెందిన ఘటన హైదరాబాద్‌లోని హబ్సిగూడలో చోటు చేసుకుంది. శనివారం హబ్సిగూడ మెట్రో స్టేషన్ వద్ద స్కూల్ ఆటోను ఓ ట్రక్కు ఢీకొట్టింది. దీంతో అదుపుతప్పిన



ఆటో ముందు వెళ్తున్న ఆర్టీసీ బస్సు కిందికి దూసుకెళ్లింది. ఆటోలో ఉన్న సాత్విక అనే విద్యార్థిని, డ్రైవర్ ఎల్లయ్య తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్రేన్ సహాయంతో ఆటోను బయటకు తీశారు. క్షతగాత్రులను నాచారంలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. అయితే పరిస్థితి విషమించడంతో సాత్విక మృతిచెందింది. ఆటో డ్రైవర్ ఎల్లయ్య పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని గాంధీ దవాఖానకు తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

# రుణమాఫీపై చర్చకు సిద్ధమా..?


## నా చరిత్ర ఏంటో.. నీ చరిత్ర ఏంటో తెలంగాణ ప్రజలకు బాగా తెలుసు

### రుణమాఫీ పాక్షికంగా చేశామని చెబితే అంగీకరిస్తాం

### పూర్తిగా చేశామంటే ఒప్పుకోం

### రైతుల వద్దకే వెళ్లి అడుగుదాం

### సీఎం రేవంత్‌కు హరీశ్‌రావు సవాల్



ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో: తన చరిత్ర ఏంటో.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చరిత్ర ఏంటో తెలంగాణ రాష్ట్ర ప్రజలకు బాగా తెలుసని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శనివారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. రైతు రుణమాఫీ పాక్షికంగా చేశామని ప్రభుత్వం చెబితే అంగీకరిస్తామని, కానీ పూర్తిగా చేశామంటే ఒప్పుకునేది లేదన్నారు. రుణమాఫీకి రూ.31 వేల కోట్లు అవసరమని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ తర్వాత రూ.17 వేల కోట్లు మాత్రమే చేసిందన్నారు.రైతులకు రూ.14 వేల కోట్లు కోత పెట్టారని విమర్శించారు. రుణమాఫీ పూర్తిగా చేయకుండానే తనను రాజీనామా చేయమని డిమాండ్ చేయడం విడ్డూరమన్నారు. క్షమాపణ చెప్పాల్సింది, రాజీనామా చేయాల్సింది తాను కాదని... పాక్షిక రుణమాఫీ చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ విషయంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. రుణమాఫీకి సంబంధించి నేరుగా రైతుల వద్దకే వెళ్లి అడుగుదామా? అని ప్రశ్నించారు. పాక్షిక రుణమాఫీ చేసి తనను రాజీనామా చేయమని అడగడం ఏమిటన్నారు. అసలు కొడంగల్‌లో ఓడిపోతే రాజకీయ సన్యాసం చేస్తానని మాట చెప్పి... తప్పిందెవరు? అని ప్రశ్నించారు. ప్రజల కోసం రాజీనామా చేసిన చరిత్ర తనది అన్నారు. రుణమాఫీ సహా ఆరు గ్యారెంటీలు సంపూర్ణంగా అమలు చేస్తే రాజీనామా చేస్తానని చెప్పానని, కానీ ఏదీ పూర్తిగా అమలు చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 22 లక్షల మందికి రుణమాఫీ చేసి, 26 లక్షల మందికి మొండిచేయి చూపిందన్నారు.

## యూకే మాజీ హై కమిషనర్ ఆందోళన



సిద్దిపేటలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆఫీసుపై శుక్రవారం రాత్రి అటాక్ జరిగింది. క్యాంపు కార్యాలయాన్ని కాంగ్రెస్ కార్యకర్తలు ధ్వంసం చేశారు. ఆ ఘటన పట్ల నెటిజెన్లు తీవ్రంగా రియాక్ట్ అవుతున్నారు. పోలీసు శాఖ అసమర్థతను ప్రశ్నిస్తున్నారు. హైదరాబాద్‌లో పనిచేసిన యూకే మాజీ హై కమిషనర్ ఆండ్రూ ఫ్లెమింగ్ .. ఆ విధ్వంసం ఘటనపై ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన తన సోషల్ మీడియా అకౌంట్ ఎక్స్‌లో స్పందించారు. ఇలాంటి వీడియోలు చూస్తూ నిద్రలేవడం బాధాకరమన్నారు. హరీశ్ రావుతో ఎంతో పరిచయం ఉందని, ఆయన పట్ల తనకు వ్యక్తిగతంగా అమితమైన గౌరవం ఉన్నట్లు ఫ్లెమింగ్ తన ట్వీట్‌లో వెల్లడించారు.

# సిద్దిపేటలో ఫ్లెక్సీ వార్

### ఎమ్మెల్యే హరీశ్ కార్యాలయంపై కాంగ్రెస్ నేతల దాడి
### అడ్డుకున్న బీఆర్ఎస్ నేతలు
### టెన్షన్ వాతావరణం



ప్రజాస్వరం, తెలంగాణ బ్యూరో : సిద్దిపేటలో ఫ్లెక్సీ వార్ కొనసాగుతోంది. శుక్రవారం అర్ధరాత్రి ఇరుపార్టీల నేతల నినాదాలతో టెన్షన్ వాతావరణం నెలకొన్నది. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు రాజీనామా చేయాలంటూ పట్టణంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. దీంతో బీఆర్ఎస్ కార్యకర్తలు అక్కడికి చేరుకుని కాంగ్రెస్ నేతలతో వాగ్వాదానికి దిగారు. అనంతరం పోలీసులు రంగప్రవేశం చేసి బీఆర్ఎస్ నాయకులను అక్కడి నుంచి పంపించారు. ఈ క్రమంలో కొందరు కాంగ్రెస్ నేతలు హరీశ్‌రావు క్యాంపు కార్యాలయంపై దాడి చేసి అక్కడున్న ఫ్లెక్సీల చింపివేశారు. ఈ ఘటనపై ఎమ్మెల్యే హరీశ్‌రావు ఎక్స్ (ట్విట్టర్)లో స్పందించారు. 'ఎమ్మెల్యే అధికారిక నివాసంపై అర్ధరాత్రి కాంగ్రెస్ గూండాలు దాడి చేసి, తాళాలు పగలగొట్టి, ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేయడం దారుణం. ఈ దాడిని అడ్డుకోవాల్సిన పోలీసులే దుండగులను రక్షించడం మరింత శోచనీయం. ఒక ఎమ్మెల్యే నివాసంపైనే ఇంత దారుణంగా దాడి జరిగిందంటే, ఇక సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటి. పోలీసుల సమక్షంలో ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం కాంగ్రెస్ మార్క్ పాలనకు నిదర్శనం. ఈ ఘటనపై తెలంగాణ డీజీపీ చర్యలు తీసుకోవాలి'. అని హరీశ్ డిమాండ్ చేశారు.

# రుణమాఫీపై ప్రశ్నిస్తే.. దాడులు చేస్తారా?



## కాంగ్రెస్ డొల్ల మాటల గుట్టు విప్పుతాం

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

### 'జై కిసాన్, జై తెలంగాణ'అని ట్వీట్

ప్రజా స్వరం, తెలంగాణ బ్యూరో : రుణమాఫీపై ప్రశ్నిస్తే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే దాడులు చేస్తారా అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. అయినా తగ్గేదే లేదని నిగ్గదీసి అడుగుతామన్నారు. కాంగ్రెస్ డొల్ల మాటల గుట్టు విప్పుతూనే ఉంటామన్నారు. రైతు రుణాలు రూ.49,500 కోట్లు ఉన్నాయని, రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్బీసీ) తెలిపిందన్నారు. రాష్ట్రం మంత్రివర్గ భేటీలో రూ.31వేల కోట్ల రుణాలను మాఫీ చేస్తున్నట్లు చెప్పారన్నారు. బడ్జెట్‌లో కేటాయించింది మాత్రం రూ.26 కోట్లు మాత్రమే అన్నారు. మూడు విడతల్లో ఇచ్చింది రూ.17,933 కోట్లు మాత్రమేనని విమర్శించారు. అయినా రుణం తీరలే.. రైతు బతుకు మారలేదని ఎక్స్ (ట్విట్టర్) వేదికగా పోస్ట్ చేశారు. 'రుణం తీరలే.. రైతు బతుకు మారలే. స్టేట్ లెవెల్ బ్యాంకర్స్ కమిటీ (ఎస్ఎల్బీసీ) లెక్క రూ.49,500 కోట్లు. కేబినెట్ భేటీలో చెప్పింది రూ.31 వేల కోట్లు. బడ్జెట్‌లో కేటాయించింది రూ.26వేల కోట్లు. మూడు విడుతల వారీగా కలిపి ఇచ్చింది రూ.17933 కోట్లు. ఒకే విడుతలో రూ.2లక్షల రైతు రుణమాఫీపై ప్రశ్నిస్తే దాడులు.. నిలదీస్తే బెదిరింపులు. అయినా తగ్గేదే లేదు. నిగ్గదీసి అడుగుతాం. నిజాలే చెపుతాం. కాంగ్రెస్ డొల్ల మాటల గుట్టు విప్పుతూనే ఉంటాం. జై కిసాన్, జై తెలంగాణ'అని కేటీఆర్ ట్వీట్ చేశారు.





# వినేశ్ ఫొగాట్‌కు గ్రాండ్ వెల్‌కమ్

## ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌కు భారీగా చేరుకున్న అభిమానులు

## కన్నీళ్లు పెట్టుకున్న వినేశ్ ఫొగట్

ప్రజా స్వరం, నేషనల్ బ్యూరో : భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ పారిస్ నుంచి స్వదేశానికి చేరుకున్నారు. శనివారం ఢిల్లీలోని అంతర్జాతీయ విమానాశ్రయంలో ల్యాండ్ అయ్యారు. ఈ సందర్భంగా రెజ్లర్ వినేశ్ ఫొగాట్‌కు గ్రాండ్ వెల్‌కమ్ స్వాగతం లభించింది. పారిస్ ఒలింపిక్స్ క్రీడల్లో వినేశ్‌పై అనర్హత వేటు పడిన విషయం తెలిసిందే. 50 కేజీల విభాగంలో 100 గ్రాములు అధిక బరువు ఉందన్న కారణంగా ఫైనల్‌కు కొన్ని క్షణాల ముందు రెజ్లర్‌పై అనర్హత వేటు పడింది. దీంతో యావత్ భారత దేశం తీవ్ర నిరాశ చెందింది. ఇక తన 'అనర్హత వేటు'పై కోర్టు ఆఫ్ ఆర్బిట్రేషన్ ఫర్ స్పోర్ట్స్(కాస్)ను వినేశ్ ఆశ్రయించగా, అక్కడా నిరాశే ఎదురైంది. ఈ నెల 16న తీర్పు వెలువరించాల్సి ఉన్నా 14వ తేదీ రాత్రి ఉన్నఫళంగా ఆమె పిటిషన్‌ను కొట్టేస్తున్నట్టు ప్రకటించడం భారత క్రీడాభిమానులను నివ్వెరపోయేలా చేసింది. కారణాలేమీ చెప్పకుండానే 'సింగిల్ లైన్ ఆర్డర్'తో కాస్ వెలువరించిన ప్రకటన అనంతరం ఆమెకు పలువురు క్రీడాకారులు మద్దతుగా నిలిచారు. ఈ పరిణామాల అనంతరం వినేశ్ తొలిసారి భారత్ చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు మద్దతుగా పెద్దఎత్తున అభిమానులు ఎయిర్‌పోర్ట్ వద్దకు వెళ్లారు. వారిని చూసిన వినేశ్ ఒక్కసారిగా భావోద్వేగానికి గురయ్యారు. కన్నీళ్లు పెట్టుకున్నారు.